
నిర్లక్ష్యం పెరిగి.. భూగర్భ జలం తరిగి..

- ఇంకుడుగుంతల నిర్మాణాలపై పట్టింపు కరవు
- ఈసారైనా పురపాలికశాఖ ఉత్తర్వులు అమలయ్యేనా?

"ఈ ఏడాది వేసవిలో కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నీటికి కటకట ఏర్పడింది. ఆ పరిస్థితి రాకుండా ఉండేందుకు ముందస్తుగా మేల్కొనే విధంగా చర్యలు తీసుకోవాలి."
- ఆరు నెలల కిందట రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ఆదేశాలు



న్యూస్‌టుడే, కరీంనగర్ కార్పొరేషన్

నగరాలు, పట్టణాల్లో రోజురోజుకు జనాభా ఎక్కువవుతుండగా శివారు ప్రాంతాల్లో ఇళ్ల సంఖ్య పెరుగుతోంది. ఖాళీ స్థలాలన్నీ మాయమవుతుండటంతో వర్షం నీరు భూమిలోకి ఇంకడం లేదు. పైగా నీటి సంరక్షణపై ఎవరూ దృష్టి సారించడం లేదు. ప్రతి ఇంటిలో బోరు తవ్వుకోవడం, నీటిని వినియోగించుకోవడం ఎక్కువ అవుతోంది. వృథా నీరంతా కాలువల గుండా వెళ్లి పోతుండటంతో భూగర్భ జలాలు ఏటా తగ్గుతున్నాయి.

అనుమతులకే పరిమితం

ఇంటి నిర్మాణ సమయంలో అనుమతులు తీసుకునే సమయంలో పట్టణ ప్రణాళిక విభాగంలో కొంత మొత్తాన్ని ఇంటి యజమానులు ఫీజు చెల్లిస్తున్నారు. చదరపు మీటర్ చొప్పున సుమారు రూ.2 వేల వరకు డిపాజిట్ చేస్తున్నారు. ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత ఇంకుడుగుంత నిర్మిస్తే ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. అనుమతులు ఇచ్చిన అధికారులు దానిని నిర్మించారా? లేదా? అనేది మాత్రం పరిశీలించడం లేదు. పైగా రూ.లక్షల్లో జమ అయిన ఆ మొత్తాన్ని ఇతర అవసరాలకు ఇన్నాళ్లు వినియోగిస్తున్నారు.


కరీంనగర్‌లోని నగరపాలిక పార్కులో నిర్మించిన ఇంకుడుగుంత

ఇళ్లలో ఇంకుడుగుంతలు నిర్మించాలన్న ఆదేశాలున్నా ఎవరూ పాటించడం లేదు. తాజాగా పురపాలక శాఖ 300 చ.మీ.ల విస్తీర్ణంలో ఉన్న ప్రతి ఇంటిలో ఇంకుడుగుంత నిర్మించాలని ఆదేశించింది. ఈసారైనా ఆదేశాలు అమలవుతాయా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

గతేడాది వర్షాలు ఆశించిన స్థాయిలో కురియకపోవడంతో ఈ ఏడాది వేసవి ప్రారంభంలోనే తాగు, సాగునీటికి ఇబ్బందులు పడ్డారు. వర్షాలు సైతం ఆలస్యంగా కురియడంతో కాస్త నీటి నిల్వలు పెరిగినప్పటికీ.. భూగర్భ జలాలు పెంచుకోవాలనే ఆవశ్యకతను గుర్తించడం లేదు. కరీంనగర్, రామగుండం నగరాలతో పాటు మున్సిపాలిటీల్లో కచ్చితంగా ఇంకుడుగుంతలు నిర్మించుకోవాలని పేర్కొంటున్నా పట్టించుకోవడం లేదు. కొత్తగా ఇళ్లను నిర్మించుకునే వారు సైతం ఆ వైపే దృష్టిసారించడం లేదు.

300ల చదరపు మీటర్లకు తప్పనిసరి

- మున్సిపాలిటీలు, నగరాల్లో 300 చదరపు మీటర్లకు మించిన అన్ని నిర్మాణాల్లో ఇంకుడుగుంత తప్పనిసరి చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.
- ఇప్పటికే ఉన్న భవనాల్లో ఏడాదిలో నిర్మించుకోవాలి.
- ఆక్యుపెన్సీ కం కంప్లీషన్ సర్టిఫికెట్ ఇచ్చేటప్పుడు ఇంకుడుగుంత నిర్మించారా లేదా క్షేత్రస్థాయిలో పరిశీలించాలి.
- వీటిని నిర్మించుకునేలా ప్రజల్లో చైతన్యం తెచ్చే బాధ్యత కూడా మున్సిపల్ కమిషనర్లదేనని ఉత్తర్వుల్లో వివరించారు.

- కరీంనగర్ నగర పరిధిలో **300** చదరపు మీటర్లు ఉన్న భవనాలు **791** ఉన్నట్లుగా ఇటీవల నిర్వహించిన సర్వేలో గుర్తించారు.
- ఇప్పటికే **458** బహుళ అంతస్తులో నిర్మించుకున్నారు.
- మిగతా **333** భవన యజమానులకు నోటీసులు ఇచ్చారు. అందులో 24 భవనాల్లో కొత్తగా నిర్మించుకున్నారు.
- స్మార్ట్‌సిటీ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ఆధునాతన సాంకేతికను జోడించి ఇంకుడుగుంతలు నిర్మిస్తున్నారు.

రేపు జిల్లా కోర్టులో లోక్ అదాలత్



పెద్దపల్లి, న్యూస్‌టుడే : పెద్దపల్లి జిల్లా కోర్టు సముదాయంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్ కుమార్ తెలిపారు. కేసుల సత్వర పరిష్కారం కోసం కక్షిదారులు లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు.

ఈనాడు
పెద్దపల్లి
శుక్రవారం సెప్టెంబరు 27, 2024

కార్మికుల భవిష్యనిధిలో సమూల మార్పులు

- ఇకపై ఆన్‌లైన్‌లో పారదర్శక సేవలు
- సీఎంపీఎఫ్ ప్రాంతీయ కమిషనర్ హరిపచౌరీ



న్యూస్‌టుడే, గోదావరిఖని

బొగ్గు గని కార్మికులకు సంబంధించి ఇకపై పారదర్శక సేవలు అందుబాటులోకి రానున్నాయి. కార్మికులు, ఉద్యోగులకు సంబంధించిన ప్రతి అంశం వారే స్వయంగా చూసుకునే సౌకర్యం అందుబాటులోకి తీసుకురానున్నారు. దీని కోసం సీ-కేర్ పోర్టల్ ద్వారా సమాచారాన్ని పొందుపరుస్తున్నామని బొగ్గు గని కార్మికుల భవిష్యనిధి(సీఎంపీఎఫ్) ప్రాంతీయ కమిషనర్ హరిపచౌరీ వెల్లడించారు. ఆయన 'న్యూస్‌టుడే'తో ముఖాముఖిలో మాట్లాడారు. గని కార్మికుల భవిష్యనిధిలో చేపడుతున్న సేవలపై వివరించారు. ఆయన మాటల్లో..

? సీఎంపీఎఫ్‌లో ఏ మార్పులు తీసుకొస్తున్నారు

✓ గతంలో ఎన్నడు లేనివిధంగా సీఎంపీఎఫ్‌లో సమూల మార్పులు తీసుకువస్తున్నాం. కోల్ ఇండియాతోపాటు సింగరేణి కార్మికులకు ఇక నుంచి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ప్రతి విషయం వారే స్వయంగా చూసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. దీని ద్వారా ఎక్కడ జాప్యం లేకుండా కార్మికులకు సంబంధించిన ఆర్థిక ప్రయోజనాలు అందుతాయి. వాటితోపాటు ఇతర సేవలు కూడా పక్కాగా ఉంటాయి. ప్రస్తుతం దానికి సంబంధించిన పనులు సాగుతున్నాయి.

? ఎలాంటి సేవలు అందుబాటులో ఉంటాయి

✓ గని కార్మికులకు సీఎంపీఎఫ్‌తోపాటు పింఛను సేవలు అందుతాయి. సీఎంపీఎఫ్‌కు సంబంధించిన అన్ని రకాల చెల్లింపులు పారదర్శకంగా అందించేందుకు అవకాశం ఉంటుంది. నిల్వ మొత్తం స్వయంగా కార్మికులే చూసుకోవచ్చు. ఏదైనా సమస్య ఉంటే ఆన్‌లైన్‌లోనే ఫిర్యాదు చేసుకునే అవకాశముంది. ఇందులో కార్మికులతో పాటు వారి కుటుంబసభ్యుల వివరాలు నమోదు చేస్తాం. దీని వల్ల సీఎంపీఎఫ్ సభ్యులకు పూర్తి భద్రత ఉంటుంది.

? ఈ ప్రక్రియ ఎప్పటివరకు పూర్తి చేస్తారు

✓ ప్రస్తుతం ఉద్యోగుల సమాచారం సేకరించాం. సింగరేణి యాజమాన్యం నుంచి అన్ని ఆన్‌లైన్‌లో సమాచారం తెప్పించాం. ఉద్యోగి, వారి కుటుంబసభ్యులు, పీఎఫ్ సంఖ్య, పాన్‌కార్డు, ఆధార్, చరవాణి నెంబరుతో సహా ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నాం. సీ-కేర్ పోర్టల్ ద్వారా బెంగుళూరుకు చెందిన సీ-డాక్ సంస్థ ఈ ప్రక్రియను చేపడుతుంది. 2025 నాటికి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. ఇప్పటికే దాదాపుగా కోల్ ఇండియా, సింగరేణికి సంబంధించిన 2.75 లక్షల ఉద్యోగుల సమాచారాన్ని సేకరించాం. వీటిని పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు.

? దీని వల్ల కార్మికులకు ప్రయోజనమేంటి

✓ ప్రతి కార్మికుడు తన చరవాణిలోనే.. అప్లికేషన్ ద్వారా తన వివరాలు, నిల్వ మొత్తం చూసుకోవచ్చు. తన ప్రయోజనం పొందే పని ఏ స్థాయిలో ఉందో ఆన్‌లైన్‌లో గమనించవచ్చు. సకాలంలో ఆర్థిక ప్రయోజనం చేతికి అందుతుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు ప్రక్రియ మొత్తం జరిగిపోతుంది. ఎక్కడ లోపం జరిగినా వెంటనే తెలిసిపోతుంది. భద్రత ఉంటుంది.

? ఒప్పంద కార్మికులకు ఆన్‌లైన్ సేవలందిస్తారా?

✓ ప్రస్తుతం శాశ్వత ఉద్యోగుల ప్రక్రియ ముగిసిన తర్వాత కాంట్రాక్టు కార్మికులకు సంబంధించిన వివరాలను నమోదు చేస్తాం. వారికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని కోల్ ఇండియా, సింగరేణి యాజమాన్యాలు ఇవ్వాల్సి ఉంది. వారి వివరాలు వచ్చిన తర్వాత ప్రక్రియ చేపడుతాం. దానికి కొంత సమయం పడుతుంది.

వృత్తివిద్య నైపుణ్యాలు పెంచుకోవాలి


విద్యార్థినికి కుట్టుమిషన్ అందిస్తున్న శోభారాణి, విజయ రమణారావు

సుల్తానాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థినులు వృత్తివిద్యలోనూ నైపుణ్యాలు పెంచుకోవాలని రాష్ట్ర మహిళా సహకార, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శోభారాణి పేర్కొన్నారు. భూపతిపూర్ కేజీబీవీ విద్యార్థినులకు కరీంనగర్ దుర్గాబాయి దేశ్‌ముఖ్ మహిళా శిశు సంక్షేమ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు, బ్యూటీషియన్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం గురువారం జరగ్గా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థినులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే విజయరమణారావుతో కలిసి శిక్షణార్థులకు కుట్టుమిషన్లు, ధ్రువీకరణపత్రాలు అందించారు. అంతకుముందు చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర మేనేజర్ విజయశ్రీ, జిల్లా మేనేజర్ జయశ్రీ, బాలికల అభివృద్ధి శాఖ జిల్లా అధికారిణి కవిత, పాఠశాల ఎస్‌వో స్వప్న పాల్గొన్నారు.

పిల్లలకు గుణాత్మక విద్య అందించాలి


హన్మంతునిపేట పాఠశాలలో విద్యార్థి పుస్తకం చదువుతుండగా పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులకు సూచించారు. పెద్దపల్లి మండలం హన్మంతునిపేట, ముత్తారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించారు. హన్మంతునిపేట బడిలో మరమ్మతుకు గురైన కంప్యూటర్లను తొలగించాలన్నారు. విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంచాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో విద్యుత్తు దీపాలు బిగించాలన్నారు. బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి అదనపు పౌష్టికాహారం సరఫరా చేయాలని చెప్పారు. ప్రధానోపాధ్యాయులు దశరథం, నాగరాజు పాల్గొన్నారు.

మంథని డిగ్రీ కళాశాలలో బీఎఫ్‌ఎస్ఐ కోర్సు

మంథని, న్యూస్‌టుడే: మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్ (బీఎఫ్ఎస్ఐ) కోర్సుకు ఎంపికైందని ప్రిన్సిపల్ జైకిషన్ ఓజా ఓ ప్రకటనలో తెలిపారు. డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు లభించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం 20 డిగ్రీ, 18 ఇంజినీరింగ్ కళాశాలలను బీఎఫ్ఎస్ఐ కోర్సులకు ఎంపిక చేసిందన్నారు. మంత్రి శ్రీధర్‌బాబు చొరవతో మంథని డిగ్రీ కళాశాల కూడా అందులో ఉందన్నారు. దీంతో కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ప్రమాదకరంగా మోడువారిన వృక్షాలు

మంథని-కాటారం ప్రధాన రహదారి పక్కన ఎక్లాస్‌పూర్ గ్రామం వద్ద మోడువారిన వృక్షాలు ప్రమాదకరంగా మారాయి. నిత్యం వేలాది మంది వాహనాలపై ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటారు. కాళేశ్వరం, వరంగల్, భూపాలపల్లిలకు కూడా వెళ్తుంటారు. గాలి దుమారానికి ఎండిపోయిన వృక్షాలు రోడ్డుపై పడి ప్రయాణికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి మోడు వృక్షాలను తొలగించాలని ప్రయాణికులు ఆర్ అండ్ బీ అధికారులను కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మంథని గ్రామీణం

ఎన్టీపీసీకి ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు


అవార్డును స్వీకరిస్తున్న ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్-2024లో ఎన్టీపీసీ రామగుండం రెండు అవార్డులు సాధించింది. న్యూదిల్లీలో గురువారం ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు.. ఎనర్జీ కన్జర్వేషన్ ఇండస్ట్రీస్ అవార్డు అందుకున్నారు. మరో వైపు పవర్ విభాగంలో 'ఎనర్జీ కంపెనీ అవార్డు'కు సంస్థ విజేతగా నిలిచింది. దీనిని కేంద్ర ప్రభుత్వ మాజీ పవర్ కార్యదర్శి అనిల్‌రజ్దాన్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. విద్యుత్తు, ఇంధన రంగాల్లో ఎన్టీపీసీ పలు విజయాలు సాధించడంతోపాటు.. ఆవిష్కరణ, ఇంధన సంరక్షణ, స్థిరమైన అభివృద్ధికి కృషికి గానూ ఈ అవార్డులు వరించాయి.


అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కల్పన

అగ్నివీర్‌తో దేశ సేవకు అవకాశం

పెద్దపల్లి, న్యూస్‌టుడే: అగ్నివీర్ వాయు నియామకాల ద్వారా దేశసేవ చేసే అవకాశం లభిస్తుందని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన పేర్కొన్నారు. పెద్దపల్లిలో గురువారం అగ్నివీర్ నియామకాలపై అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఇంటర్మీడియేట్ సైన్స్ విభాగంలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అగ్నివీర్‌కు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి సందీప్, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్ మైత్రేయి పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్‌లోని భవనాలకు నోటీసులు


పట్టణ ప్రణాళికాధికారితో మాట్లాడుతున్న బాధితులు

గోదావరిఖని పట్టణం, న్యూస్‌టుడే: నగరపాలక పరిధి మల్కాపూర్‌లోని మల్లపురానికుంటకు సంబంధించిన ఎఫ్‌టీఎల్‌లో భవనాలు నిర్మించారంటూ.. 16 మందికి అధికారులు జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు గురువారం నోటీసులు జారీచేశారు. వారం రోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా అందులో పేర్కొన్నారు. చెరువు శిఖంలోని 36 కట్టడాలను వెంటనే ఖాళీ చేయాల్సిందిగా అధికారులు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు నోటీసులు అందుకున్న పలువురు.. నగరపాలక కార్యాలయంలోని పట్టణ ప్రణాళిక అధికారులను కలిసి పరిస్థితులను వివరించారు. నోటీసులకు వివరణ ఇస్తే వాటిని జిల్లా పాలనాధికారికి పంపిస్తామని అధికారులు వారితో పేర్కొన్నారు.

మడత మంచాల్లో చికిత్స.. బెడ్‌షీట్ల కొరత

పెద్దపల్లి జిల్లా ప్రధాన ఆస్పత్రి దుస్థితి


ఒకే మంచంలో రోగితో పాటు ఆమె బంధువులు

న్యూస్‌టుడే, పెద్దపల్లి

పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో ప్రతి రోజు ఇవే దృశ్యాలు పునరావృతమవుతున్నాయి. వైద్యసేవలు బాగున్నప్పటికీ వసతుల లేమితో రోగులకు అవస్థలు తప్పడం లేదు. ఆస్పత్రిని 200 పడకల స్థాయికి ఉన్నతీకరిస్తామని గత ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆస్పత్రిలో రోగుల సంఖ్య పెరిగితే మడత మంచాలు తీసుకువచ్చారే తప్ప ఆస్పత్రి స్థాయి పెంచకపోవడంతో 50 పడకలకే పరిమితమైంది. ప్రస్తుతం ప్రభుత్వ ఆస్పత్రికి ప్రతిరోజు 800 మంది అవుట్ పేషెంట్లు వివిధ అనారోగ్య సమస్యలతో వస్తుంటారు. వీరిలో సగం మంది జ్వర పీడుతులే ఉండటంతో వైద్యం చేయడమే కష్ట సాధ్యమవుతుంది. చాలా మందికి మడత మంచాల్లోనే చికిత్సలు అందిస్తున్నారు. వీటిపై కూడా బెడ్‌షీట్లు ఉండటం లేదు.

మందులకు తప్పని అవస్థలు

వైద్యానికి వచ్చే రోగులకు ఆస్పత్రిలో తగినంతగా మందులు అందుబాటులో ఉండటం లేదు. 50 పడకల రోగులకు సరిపడా మందులే ప్రతినెలా వస్తున్నాయి. కేంద్ర డ్రగ్స్ స్టోర్ నుంచి మందుల కొనుగోలు చేయడానికి రూ.67,55,384 పరిమితి ఉంటుంది. వీటిలో ఇప్పటి వరకు రూ.31,82,424 నిధులను మందుల కొనుగోళ్లకు వెచ్చించారు. సర్జికల్ పరికరాలకు రూ.27,78,334 వరకు పరిమితి ఉంటుంది. ఇందులో కూడా సగం కోటా పూర్తయింది. డ్రగ్ స్టోర్‌లో లేని మందులను బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. దీంతో రోగులకు సకాలంలో మందులు అందడం లేదు.

సేవలను విస్తరిస్తాం

పెద్దపల్లి జిల్లా ఆస్పత్రిలో గతంలో కంటే రోగుల సంఖ్య పెరగడంతో సేవలను విస్తృతం చేస్తున్నాం. ఆస్పత్రిలోని పాత భవనం సరిపోక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కువ సంఖ్యలో రోగులు వస్తే మడత మంచాలలో చికిత్స అందిస్తున్నాం. బెడ్‌షీట్ల కొరత లేదు. డ్రగ్‌స్టోర్‌లో లేని మందులను బయట కొనుగోలు చేసి.. రోగులకు చికిత్స అందిస్తున్నాం.
- శ్రీధర్, డీసీహెచ్

- పెద్దపల్లి మండలం పెద్దబొంకూర్ గ్రామానికి చెందిన గట్టయ్య తీవ్రమైన జ్వరంతో గురువారం ఆస్పత్రికి వచ్చారు. మంచాలు ఖాళీ లేకపోవడంతో సిబ్బంది వైద్యసేవలు అందించలేకపోయారు. అవస్థ భరించలేక ఆస్పత్రిలోని కుర్చీలపైనే పడుకున్నాడు.




ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ అరుణశ్రీ, అధికారులు

ఐలమ్మ పోరాటం మహిళలకు స్ఫూర్తి

పెద్దపల్లి కలెక్టరేట్, న్యూస్‌టుడే: తెలంగాణ వీరవనిత చిట్యాల(చాకలి) ఐలమ్మ పోరాటం మహిళలకు స్ఫూర్తి అని జిల్లా అదనపు కలెక్టర్ అరుణశ్రీ పేర్కొన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా సమీకృత పాలనా ప్రాంగణంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదనపు కలెక్టర్ అరుణశ్రీ, జిల్లా అధికారులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు సక్రమంగా అందేనా?

- పంచాయతీకొక పారిశుద్ధ్య కార్మికుడికి బాధ్యతలు
- వనరుల మరమ్మతులపై శిక్షణ

న్యూస్‌టుడే, పెద్దపల్లి కలెక్టరేట్

పల్లె ప్రజలకు తాగునీరు సరఫరా చేసే క్రమంలో అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. తరచూ పైపులైన్ లీకేజీ, చేతిపంపుల మరమ్మతులు, బోరు మోటార్లు కాలిపోవడం, నీటిలో నాణ్యత లోపించడం జరుగుతోంది. ఇక మీదట ఇలాంటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా పంచాయతీకొక సహాయకుడిగా మల్టీవర్కర్(పారిశుద్ధ్య కార్మికుడు)కి నీటి సరఫరా బాధ్యతలు అప్పగించారు. తాగునీటి సరఫరాలో ఇబ్బందులను తొలగించడమే వీరి విధి. దీనికి సంబంధించి కార్మికులకు అధికారులు జిల్లాలో మండలాల వారిగా రెండు విడతల్లో ఒక్క రోజు శిక్షణ ఇస్తున్నారు. ఇక నుంచి గ్రామాల్లో తాగునీరు సరఫరాకు ఆటంకాలు ఉండే అవకాశం లేదు.

జిల్లాలో మిషన్ భగీరథ వివరాలు

గ్రామీణ జనాభా	4,91,319
పంచాయతీలు	266
నల్లా కనెక్షన్లు	1,47,481

మూలన పడుతున్న చేతిపంపులు

గ్రామాల్లో మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలతో పాటు చేతిపంపులు, బోర్లు మూలన పడుతున్నాయి. రోజుల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవడం ప్రజలకు శాపంగా మారింది. దీంతో ప్రజలు కాలుష్య నీటి బారిన పడి ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి. వేసవిలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉంటుంది. నీటి సరఫరా లోపాలపై ప్రజలు ఖాళీ బిందెలతో ఆందోళన చేసిన ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయ లోపం కూడా ఈ పరిస్థితులకు కారణం. సహాయకుల నియామకంతోనైనా సమస్యకు పరిష్కారం లభిస్తుందో చూడాలి.


పెద్దపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శిక్షణ పొందుతున్న కార్మికులు

శిక్షణ కాలం పెంచాలి

జిల్లా నుంచి నలుగురు మిషన్ భగీరథ అధికారులు హైదరాబాద్‌లో నిర్వహించిన శిక్షణలో మాస్టర్ శిక్షకులుగా పాల్గొన్నారు. వీరు జిల్లాలో కార్మికులకు రెండు విడతలుగా వృత్తి నైపుణ్యతపై అవగాహన కల్పిస్తున్నారు. మోటార్లు కాలిపోతే మరమ్మతులు చేయడం, పైపులైన్ లీకేజీలు అరికట్టడం, నీటి నాణ్యత పరీక్షలు ఎలా చేయాలనే అంశాలపై పరికరాలతో తర్ఫీదు ఇస్తున్నారు. అయితే ఒక్క రోజు శిక్షణలో నేర్చుకోవడం సాధ్యం కాదని.. శిక్షణ కాలం మరింత పెంచితే సత్ఫలితాలు ఉంటాయని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

పంచాయతీ నుంచే నిధులు

జిల్లాలో ప్రతి పంచాయతీ నుంచి 45 ఏళ్లలోపు ఉన్న వ్యక్తిని ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నాం. ఈ నెలాఖరులోపు శిక్షణ పూర్తికానుంది. చేతిపంపులు, బోరు మోటార్ల మరమ్మతులు, నీటి నాణ్యత తదితర అంశాలపై అవగాహన కల్పిస్తున్నాం. వీరు పనులకు అవసరమైన ఖర్చులను పంచాయతీ నిధుల నుంచి పొందాలి. నీటి సరఫరా సమస్యలకు సత్వర పరిష్కారం లభించనుంది. - **శ్రీనివాస్, ఈఈ మిషన్ భగీరథ**

రాజులు ఏలిన ప్రాంతాలు.. ప్రకృతి సోయగాలు


ఎలగందుల ఖిల్లా


వేములవాడ రాజన్న ఆలయం

- ఉమ్మడి జిల్లాలో పలు చారిత్రక క్షేత్రాలు
- నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

జలపాతాలు, చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు.. ఉమ్మడి జిలా పర్యాటకులను మనసులను పులకరింపజేస్తాయి. యాత్రికులను ఆకట్టుకునే పుణ్యక్షేత్రాలు.. రాజులు పాలించిన ప్రాంతాలను ఇప్పటికీ వేలమంది సందర్శిస్తున్నారంటే వీటి ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు. ఆయా ప్రాంతాల్లో సౌకర్యాలు.. వసతులు కల్పిస్తే మరింత ఆదాయం సమకూరనుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పర్యాటక క్షేత్రాల విశేషాలు, వాటి అభివృద్ధి అనుకూలతలపై 'న్యూస్‌టుడే' కథనం.

ప్రదేశం: ● నిర్మించినది ■ ప్రత్యేకత ✱ కల్పించాల్సిన సౌకర్యాలు

కోటలు.. చరిత్రకు ఆనవాళ్లు

★ ఎలగందుల ఖిల్లా, కరీంనగర్ జిల్లా

● శాతవాహనులు. కోటి లింగాలను రాజధానిగా ప్రాంతీయ ఏడు రాజులు గోభద, నారన, కంవయస, సమగోప పాలనలో నిర్మితమైనట్లు లభ్యమైన నాణేలను బట్టి తెలుస్తుంది.

■ ఈ కోట శాతవాహనులతోపాటు బాదామి చాళుక్యుల (550-750) నుంచి ఆసఫ్‌జాహీల(1724-1948) కాలం వరకు పాలన కేంద్రంగా విరాజిల్లింది. ఒకప్పుడు జిల్లా కేంద్రంగా ఉండేది.

✱ ఎలగందుల ఖిల్లా చారిత్రక ప్రాంతం కావడంతో ప్రభుత్వం 2014లో పర్యాటక కేంద్రంగా ప్రకటించి.. సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశారు. అయితే కొద్ది రోజులకే నిలిచిపోయింది. సామగ్రి దెబ్బతింది. పర్యాటకంగా అభివృద్ధి చెందాలంటే గార్డెన్స్, పార్కులు, రెస్టారెంట్లు, రవాణా సౌకర్యాలు, వసతులు కల్పించాల్సి ఉంది. కోట గురించి ఈతరం వారికి తెలియజేసేలా తీర్చిదిద్దాలి.



★ మొలంగూరు ఖిల్లా, కేశవపట్నం మండలం, కరీంనగర్ జిల్లా

● ప్రతాపరుద్రుని అధికారులలో ఒకరైన వొరగిరి మొగ్గరాజు దీనిని నిర్మించాడు.

■ దూద్ బావి బహుళ ప్రాచుర్యం

✱ గుట్టపైన, కింద కోనేరులు.. దూద్ బావి, శివాలయం, వీరభద్రాలయం, కోట బురుజులు, రాతి ద్వారాలు, కందకాలు, ఫిరంగులు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి దూద్ బావిలోని నీరు ఏ కాలంలో అయినా పాల వలె తెల్లగా ఉంటాయి. ఈ నీరు ఆరోగ్యానికి మంచిదని అక్కడి గ్రామస్థులు తీసుకెళతారు.. ఈ ప్రాంతంలో సుందరీకరణ పనులు చేపట్టాలని కోరుతున్నారు.



★ రామగిరి ఖిల్లా, కమాన్‌పూర్ మండలం బేగంపేట, పెద్దపల్లి జిల్లా

● శాతవాహనులు నిర్మించారని చారిత్రక అధారాలు చెబుతున్నాయి. వారు దీనిని రక్షణ కోటగా వినియోగించుకొని కోటి లింగాలను రాజధానిగా చేసుకొని పాలించారు.

■ శత్రుదుర్భేద్యమైన ఈ కోట అరుదైన శిల్పకళ, బురుజులకు నిలయం. కోట పరిసర ప్రాంతాల్లో వనమూలికల సంపత్తి, అరుదైన వృక్షాలున్నాయి.

✱ ఇక్కడ వనమూలికలు, అరుదైన వృక్షాలను చూసేందుకు వివిధ రాష్ట్రాల శాస్త్రవేత్తలు, ఆయుర్వేద నిపుణులు ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వస్తారు. ఈ కోటకు అన్ని రకాలు వసతులు, సౌకర్యాలు కల్పించి అభివృద్ధి చేస్తే ఉమ్మడి జిల్లాలోనే సుందరమైన ప్రదేశంగా విరాజిల్లుతుంది. వివిధ విశ్వవిద్యాలయాల విద్యార్థులకు బొటానికల్ పర్యటన క్షేత్రంగా మారనుంది.

★ కరీంనగర్ మానేరు జలాశయం

సాగు, తాగు నీటి అవసరాలు తీర్చేందుకు కరీంనగర్‌లో మానేరు డ్యాం నిర్మాణం చేశారు. ఈ డ్యామును ఆనుకొని ప్రభుత్వం ఉజ్వల, జింకల పార్కులు, హరిత హోటల్ నిర్మించారు.

✱ మానేరు డ్యాంపై నీడ వసతి, ఫుడ్ కోర్టులు పెరగాల్సిన అవసరముంది. కొదురుపాక మధ్య మానేరులోనూ వసతులు, సౌకర్యాలు పెంచితే బోటింగ్‌కు సందర్శకుల సంఖ్య పెరగనుంది. ఉజ్వల, జింకల పార్కులను మరింత ఆకర్షించేలా తీర్చిదిద్దాలి.

✦ హరిత హోటల్‌ను త్వరితగతిన పూర్తి చేయాల్సి ఉంది. ఇస్కాన్ టెంపుల్, తిరిదేవ వేంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణంతోపాటు మానేరు రివర్ ఫ్రంట్, తీగల వంతెన తీర్చిదిద్దితే ప్రాంతాలను జిల్లాలో పర్యాటకులు పెరగనున్నారు. కోటి రూపాయాలతో తయారైన క్రూజ్ పడవను త్వరలో నడిపించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.



★ వేములవాడ శ్రీరాజరాజేశ్వర దేవాలయం

● పశ్చిమ చాళుక్య చక్రవర్తి ఆర్ విక్రమాదిత్యుని మహా మండలేశ్వరుడైన రాజాదిత్యుడు రాజరాజేశ్వర దేవాలయం నిర్మించాడని శిలాశాసనం ద్వారా తెలుస్తోంది.

■ దక్షిణ కాశీగా విరాజిల్లుతుంది. వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడి దర్శనానికి వస్తుంటారు.

✱ ప్రసాద్ లాంటి కేంద్ర పథకాలు వేములవాడతో పాటు కొండగట్టు, ధర్మపురి, ఇల్లందకుంట దేవాలయాలకు వర్తింపజేయాలి. రాష్ట్ర ప్రభుత్వం సైతం మరిన్ని నిధులు మంజూరు చేసి మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించాలి. రవాణా పరంగా రైల్వేలైన్ వేయాల్సి ఉంది.



★ గోదావరిఖని గనులు

సహజ నిక్షేపాలుగా బొగ్గు గనులు బయటపడ్డాయి.

■ భూగర్భ గనుల తవ్వకాలు, ఓపెన్ కాస్ట్ మైనింగ్ పనులతోపాటు పవర్ ప్లాంట్లు ఉన్నాయి.

✱ గతంలో ఆర్జీ1, మైనింగ్ సంస్థలు కలిసి పర్యాటక సందర్శన అవకాశం కల్పించారు. బస్సు సర్వీసు ద్వారా తీసుకొచ్చి భూగర్భ గనిలో జరుగుతున్న బొగ్గు గనుల తవ్వకాలు, ఈ ప్రాంత విశేషాలు చూపించేవారు. అనంతరం నిలిపివేశారు. పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు.

అసలే ఆలస్యం.. ఆపై ఆవేదన

- ఉమ్మడి జిల్లాలో 228 మందికి 61 పేర్లతోనే జాబితా
- 2008 డీఎస్సీ బాధితులకు ఒప్పంద ఉద్యోగాల తీరు

న్యూస్‌టుడే, కరీంనగర్ విద్యా విభాగం

సర్కారు కొలువే లక్ష్యంగా చదివిన వారి ఆశలపై చివరి నిమిషంలో ప్రభుత్వ నిర్ణయం నీళ్లు చల్లింది.. న్యాయం కోసం పోరాడిన వారికి అనుకూలంగా కోర్టులు తీర్పునిచ్చాయి.. ఇది పదహారేళ్ల కిందటి మాట.. బాధితులకు కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలివ్వాలని ప్రభుత్వం నిర్ణయించినా అర్హుల జాబితా తప్పుల తడకగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది..

2008 డీఎస్సీలో అర్హత సాధించినా ఉపాధ్యాయ ఉద్యోగాలకు దూరమైన అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలు(సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు)గా నియమించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వెబ్‌సైట్‌లో ఉంచిన ఉమ్మడి జిల్లా జాబితాలో చాలా తక్కువ మంది పేర్లుండగా, అందులో అసలైన బాధితుల వివరాలు లేవు.

బాధితులు 228 మంది

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో 2008 డీఎస్సీలో 970 ఎస్జీటీ పోస్టుల భర్తీ చేపట్టగా రెండేళ్ల అనంతరం ఫలితాలు వెల్లడించారు. 30 శాతం పోస్టులను డీఈడీ అభ్యర్థులకు కేటాయించడంతో దాదాపు 228 మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ఆనందాన్నిచ్చినా వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితాలో కేవలం 61 మంది పేర్లు మాత్రమే ఉన్నాయి. వాళ్లు కూడా అప్పట్లో రెండు ఉద్యోగాలకు పరీక్ష రాసి, స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికైన వారే. 16 ఏళ్ల తర్వాత కొలువు దక్కబోతుందన్న బాధితుల సంతోషం జాబితా చూడగానే నీరుగారిపోయింది. రెండు రోజుల కిందట ప్రభుత్వం ప్రకటించినప్పటి నుంచి బాధితులు డీఈవో కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. జాబితా రూపకల్పనలో జిల్లా అధికారుల తప్పిదం రాష్ట్ర విద్యాశాఖకు తెలియడంతో గురువారం వెబ్‌సైట్ నుంచి దాన్ని తొలగించారు.


జాబితాలో పేర్లు లేవని డీఈవో కార్యాలయానికి వచ్చిన 2008 డీఎస్సీ బాధితులు

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

ఉమ్మడి రాష్ట్రంలో 2008లో డీఎస్సీ నిర్వహించిన సందర్భంగా చివరి నిమిషంలో 30 శాతం పోస్టులను ప్రత్యేకంగా డీఈడీ చేసిన వారికి ప్రభుత్వం కేటాయించింది. ఈ నిర్ణయంతో మార్కుల పరంగా ముందున్న ఎంతో మంది బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. తమకు ఉద్యోగాలు ఇవ్వాలంటూ పోరాటం చేస్తూనే ఉన్నారు. గత శాసనసభ ఎన్నికలకు ముందు వీరికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. పార్టీ అధికారంలోకి రావడంతో ఒప్పంద విధానంలో నియామకానికి విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 27 నుంచి అక్టోబరు 5 వరకు ధ్రువపత్రాల పరిశీలన, తదుపరి పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో వెరిఫికేషన్ పత్రాన్ని అందుబాటులో ఉంచనున్నట్లు ప్రకటించింది. బాధితులు పూర్తి వివరాలు నింపి కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం తీసుకునేందుకు అంగీకరిస్తున్నట్లు సంతకాలు చేయాలని సూచించింది.

ఇప్పటికైనా న్యాయం చేయాలి

-టి.స్నేహ, అభ్యర్థిని



2008 డీఎస్సీలో అర్హత సాధించినా అధికారుల నిర్ణయంతో ఉద్యోగాలు కోల్పోయాం. విద్యాశాఖ రూపొందించిన జాబితాలో మా పేర్లే లేవు. ఇప్పటికైనా బాధితులకు న్యాయం చేయాలి.

జాబితాను సరిచేయండి

-ఎస్.జలపతిరెడ్డి, అభ్యర్థి



చాలా ఏళ్ల తర్వాత ఒప్పంద ఉద్యోగమైనా దక్కుతుందని సంతోషించా. డీఎస్సీలో నష్టపోయిన అభ్యర్థుల పేర్లు జాబితాలో లేవు. అసలే ఆలస్యం, ఆపై ఇలా చేయడం సరికాదు. జాబితాను సరిచేయాలి.

వివరాలు ప్రభుత్వానికి నివేదిస్తాం

-జనార్దన్‌రావు, కరీంనగర్ డీఈవో

వెరిఫికేషన్ కోసం వెబ్‌సైట్‌లో ఉంచిన జాబితా గతంలో పంపించింది. అందులో తప్పిదాలుంటే పరిశీలన బృందంతో తనిఖీ చేయిస్తాం. నష్టపోయిన వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. వెబ్‌సైట్ నుంచి జాబితా తొలగించిన విషయం నాకు తెలియదు.

శుక్రవారం నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో బాధితుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

ముగిసిన రాష్ట్ర స్థాయి జూడో పోటీలు


విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో అతిథులు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఎస్‌జీఎఫ్‌ఐ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన 68వ రాష్ట్రస్థాయి జూడో పోటీలు గురువారం ముగిశాయి. వరంగల్ నగరంలోని పోచమ్మ మైదాన్ సమీపంలోని కెమిస్ట్రీ భవన్‌లో అండర్-14 విభాగంలో నిర్వహించిన పోటీలకు రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాలకు చెందిన 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. బాలికల విభాగంలో వరంగల్ జిల్లా ఛాంపియన్‌షిప్ సాధించింది. రెండో స్థానంలో కరీంనగర్ నిలిచింది. బాలుర విభాగంలో కరీంనగర్ జిల్లా ఛాంపియన్‌షిప్ సొంతం చేసుకోగా.. రన్నరప్‌గా వరంగల్ జిల్లా దక్కించుకుంది. విజేతలకు ఒలింపిక్ సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్ పతకాలు, ధ్రువపత్రాలు అందించారు. ఎస్‌జీఎఫ్‌ఐ కార్యదర్శి దస్రునాయక్, వ్యాయామ సంఘం అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, కోచ్‌లు సంతోష్, కుమార్, రాజు, కిషన్, బాలమురళీకృష్ణ పాల్గొన్నారు.

29న కొండగట్టులో బ్రాహ్మణ సంఘం చర్చాగోష్ఠి

కరీంనగర్ సాంస్కృతికం, న్యూస్‌టుడే: బ్రాహ్మణ వర్గీయులు ఎదుర్కొంటున్న సమస్యలు, సామాజిక అంశాలపై చర్చించేందుకు ఈ నెల 29న కొండగట్టులోని బృందావనం ఫ్యామిలీ రిసార్ట్‌లో చర్చాగోష్ఠి నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంక్షేమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.ఉజ్వల, రిసార్ట్ అధినేత మర్రిపల్లి కొండల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వేదిక వ్యవస్థాపకుడు బాల శ్రీనివాసులు అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి రాష్ట్రంలోని పలువురు ముఖ్య అర్చకులు, అతిథులు హాజరవుతారన్నారు. వివిధ వ్యాపారాలు చేసే బ్రాహ్మణ కుటుంబాల కోసం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామని, ఔత్సాహికులు 73821 71021, 90595 50280 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

28న గురుకుల ఉపాధ్యాయుల ధర్నా

కరీంనగర్ కొత్తపల్లి: గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ దశలవారీగా పోరాట కార్యక్రమంలో భాగంగా 28న హైదరాబాద్ ధర్నాచౌక్‌లో నిర్వహించనున్నట్లు టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చావ రవి తెలిపారు. గురువారం కొత్తపల్లి మండలం చింతకుంట తదితర గురుకుల పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మాట్లాడారు. గురుకుల పాఠశాలల్లో మారిన పని వేళలతో స్టడీ అవర్స్ తర్వాత రాత్రి 9.00 గంటలకు ఇళ్లు చేరడానికి మహిళా ఉపాధ్యాయులు అవస్థలు పడుతున్నారన్నారు.

శ్రీరామసాగర్‌కు 1.09 లక్షల క్యూసెక్కుల వరద

జగిత్యాల ధరూర్‌క్యాంపు, న్యూస్‌టుడే: ఎగువన కురుస్తున్న వర్షాలతో శ్రీరామసాగర్ ప్రాజెక్టులోకి మరోసారి భారీగా వరద వచ్చిచేరుతోంది. గురువారం సాయంత్రం వరకు ప్రాజెక్టులోకి 1.09 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 22 స్పిల్‌వే గేట్లద్వారా 81,224 క్యూసెక్కులను, ఎస్కేప్ గేట్లద్వారా 1,200 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు నుంచి వరదకాలువకు నీటివిడుదలను 19 వేల క్యూసెక్కులకు పెంచి మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు. ప్రాజెక్టులో గరిష్ఠస్థాయిలో 80.501 టీఎంసీల నీరు నిలువుంది. అధికంగా నీటిని విడుదల చేస్తున్నందున గోదావరి నది, వరదకాలువ పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

ట్రేడింగ్ యాప్‌లో రూ.4.45 లక్షలు స్వాహా

ధర్మపురి, న్యూస్‌టుడే: ట్రేడింగ్ యాప్‌లో రూ.4.45 లక్షలు పోగొట్టుకున్న ఉదంతం గురువారం ధర్మపురిలో వెలుగు చూసింది. స్థానిక ఎస్సై మహేష్ కథనం మేరకు.. పట్టణానికి చెందిన ఓ యువకుడు కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్స్‌కు ఆకర్శితుడయ్యాడు. ఈ క్రమంలో ట్రేడింగ్ ఇన్వెస్టుమెంటు యాప్‌లో తన వివరాలను నమోదు చేసుకున్నాడు. మొదట కొంత నగదు తన బ్యాంకు ఖాతాలోకి జమ కావడంతో.. మరో ట్రేడింగ్ యాప్‌లో తనకు సంబంధించిన పాన్ కార్డు, బ్యాంకు ఖాతా తదితర వివరాలను నమోదు చేసి.. అన్నింటికీ అనుమతిలిచ్చాడు. దీంతో వెంటవెంటనే తన ఖాతాలో నుంచి రూ.4.45 లక్షలు డెబిట్ అయినట్లు సందేశాలు రావడంతో పోలీసులను ఆశ్రయించాడు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, న్యూస్‌టుడే: కొడిమ్యాల మండలం సూరంపేట గ్రామానికి చెందిన నక్క సాయి(25) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన సాయి కూలీ పనిచేసుకొని జీవిస్తున్నాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై, చెడు వ్యసనాలకు అలవాటు పడి తీవ్ర ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. ఏడాది కిందట అతని భార్య, బాబుతో పాటు అమ్మగారికి వెళ్లిపోయింది. ఆర్థిక ఇబ్బందులు, భార్య కాపురానికి రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై గురువారం తెల్లవారుజామున ఇంటి ముందు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. మృతుడి తల్లి సత్తవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

కారు కొనివ్వలేదని మనస్తాపంతో..

జగిత్యాల గ్రామీణం: కారు కొనివ్వలేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. జగిత్యాల గ్రామీణ ఎస్సై సదాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన బేతపు వంశీ(20) కారు కొనివ్వాలని తండ్రి రాజలింగయ్యను కొన్ని రోజులుగా అడుగుతున్నాడు. తండ్రి కొనివ్వకపోవటంతో లక్ష్మీపూర్ గుట్ట వద్ద చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గురువారం మృతదేహాన్ని గుర్తించిన పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని అయిదు రోజుల కిందట ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నైపుణ్యాలతో మరమగ్గాల వస్త్రోత్పత్తుల్లో రాణింపు
ఆధునికత వైపు అతివల పయనం

ఈనాడు డిజిటల్, సిరిసిల్ల

వస్త్రోత్పత్తులంటేనే అద్భుతమైన కళానైపుణ్యం ఉండాలి. తమ అభిరుచికి తోడు ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచనలు చేస్తేనే ఈ రంగంలో రాణింపు సాధ్యం. ఒకప్పుడు చేనేత మగ్గాలపైన కనిపించే మహిళలు నేడు మరమగ్గాల వైపు అడుగులు వేస్తున్నారు. వస్త్రోత్పత్తుల్లో వస్తున్న ఆధునికతను సైతం అందిపుచ్చుకుంటున్నారు. కుటుంబ పోషణకు ఉపాధిగా మార్చుకున్నారు. ఆ ఆత్మవిశ్వాసం వారి కుటుంబాల్లో వెలుగులు నింపుతోంది. మగవారికి దీటుగా మరమగ్గాలను నడిపిస్తున్నారు. ఓవైపు ఇంటి బాధ్యతలు చూస్తూనే కుటుంబానికి ఆర్థికంగా అండగా నిలుస్తూ పలువురికి స్ఫూర్తినిస్తున్నారు సిరిసిల్లకు చెందిన మహిళలు.

సిరిసిల్లలో దశాబ్దాల క్రితమే మరమగ్గాల వస్త్రపరిశ్రమ వేళ్లూనుకుంది. పురాతనమైన మగ్గాలపై ఒకే రకమైన ఉత్పత్తులకు పరిమితమవడం వల్ల ఇక్కడి పరిశ్రమ తరచూ సంక్షోభంలోకి వెళ్తుంది. తరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న నేతన్నలు ఇప్పుడిప్పుడే బహిరంగ మార్కెట్‌లోకి అడుగు పెడుతున్నారు.

పిల్లల ఉన్నత చదువులకు...



పిల్లలు ఉన్నత చదువులు చదువుతామని పట్టుబట్టారు. కొడుకు ఇంజినీరింగ్ మూడో సంవత్సరం, కూతురు ఇంటర్ రెండో సంవత్సరం. వారి చదువుకు అప్పులు చేయడం కంటే చిన్నప్పటి నుంచి తెలిసిన పని కావడంతో మరమగ్గాలు నడిపించాలని నిర్ణయించుకున్నాను. నా భర్త కొత్త డిజైన్లు తయారు చేస్తుంటారు. వాటికి తగ్గట్టుగా చీరలు, పంచెలు వంటివి నేస్తున్నాను. నాతోపాటు మరో ఇద్దరికి పని కల్పిస్తున్నాను. పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. - సామల వాణి, అంబికానగర్

- వివిధ రకాల వస్త్రోత్పత్తులను ఉత్పత్తి చేస్తూ మార్కెట్‌లోనూ తమకంటూ ప్రత్యేకతను చాటుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. నేతన్నలకు ఆయా కుటుంబాల్లోని మహిళలు చేదోడుగా నిలుస్తున్నారు.
- కాలక్షేపానికి నేర్చుకున్న కళ ఇప్పుడు వారికి అదే వృత్తిగా మారింది.
- సాధారణ మరమగ్గాలపైనే కాకుండా డాబీ, జకార్డులు అమర్చిన వాటిపైన వస్త్రోత్పత్తుల్లోనూ తమ నైపుణ్యంతో రాణిస్తున్నారు.
- పట్టణంలో శాంతినగర్, రాజీవ్‌నగర్, అంబికానగర్, బీవైనగర్‌ల్లోని చాలా ఇళ్లలోని కార్ఖానాల్లో మరమగ్గాలపై వస్త్రోత్పత్తులు నేస్తున్న మహిళలు కనిపిస్తున్నారు. వీరు బీములు పోయడం మినహా మిగతా అన్ని పనులు చేస్తున్నారు. వస్త్రాలకు డిజైన్లు వేయడం, కండెలు చుట్టడం, టాకాలు వేయడం వంటి పనులు చేస్తున్నారు.


ఎలక్ట్రానిక్ జకార్డు అమర్చిన మరమగ్గంపై వస్త్రోత్పత్తులు

ఆర్థికంగా నిలదొక్కుకోవాలని...



బీడీలు చుడుతూ ఖాళీ సమయంలో భర్తతో కలిసి అప్పుడప్పుడు మరమగ్గాలు నడపడం నేర్చుకున్నా. బీడీల పని నెలలో పదిహేను రోజులు కూడా రావడం లేదు. పిల్లలు పెద్దవాళ్లు అవుతుండటంతో ఖర్చులు పెరుగుతూ వస్తున్నాయి. అప్పులు చేసి అగాధంలో పడే కంటే భార్యాభర్తలం ఇద్దరం ఇంట్లోనే వచ్చిన పని చేస్తున్నాం. ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నాలు చేస్తున్నాం. ప్రభుత్వ ఆర్డర్లతోపాటు వివిధ రకాల ప్రైవేటు ఆర్డర్లు దోమ తెరలు, గ్రే కలర్ పాలిస్టర్ కూడా తీసుకుంటున్నాం.- బిల్ల అత, రాజీవ్‌నగర్

గుర్తింపు లభించింది



మరమగ్గాలు నడపడం, వస్త్రోత్పత్తులపై నా భర్త తర్ఫీదు ఇచ్చారు. ఉదయం ఇంటి పనులు పూర్తయ్యాక కార్ఖానాలో మరమగ్గాలు నడుపుతాను. రాత్రి సమయంలో ఆయన చూసుకుంటారు. బతుకమ్మ చీరల సమయంలో పెట్టుబడులకు ఇబ్బంది కాకుండా, కార్మికుల కొరతను అధిగమించేందుకు మేమే నడుపుకున్నాం. 2023లో చేనేత, జౌళిశాఖ ఉత్తమ మహిళా కార్మికురాలిగా గుర్తించింది. నాలా చాలా కుటుంబాల్లోని గృహిణులు మరమగ్గాలు నడుపుతూ చేదోడు వాదోడుగా ఉంటున్నారు. - వనం సంధ్య, రాజీవ్‌నగర్

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 4 PM)
గోదావరిఖని : 80085 73573
పెద్దపల్లి : 80085 73542
మంథని : 99122 68471

న్యూస్‌టుడే, ఓదెల

? ఓదెల మండల కేంద్రంలో ఇళ్ల సమీపంలోనే చెత్త పడేస్తున్నారు. దీంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. - శ్రీనివాస్, ఓదెల.

✓ వెంటనే గ్రామంలో ఇళ్ల సమీపంలో వేసిన చెత్తను తొలగించేందుకు కృషి చేస్తాం. - వి.చంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఓదెల.

నేర వార్తలు

చికిత్స పొందుతూ రైతు మృతి


సతీశ్

ఎలిగేడు(సుల్తానాబాద్), న్యూస్‌టుడే: చికిత్స పొందుతూ రైతు మృతి చెందిన ఘటన ఎలిగేడు మండలం ధూళికట్టలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై శ్రీధర్, బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు మారం సతీశ్(35) ఈ నెల 21న ఇంటి పైకప్పు మెట్లు ఎక్కుతుండగా జారీ పడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో కరీంనగర్‌లో చికిత్స పొందాడు. అనంతరం బుధవారం ఇంట్లో మళ్లీ కళ్లు తిరిగి కింద పడగా.. ముక్కు, చెవుల నుంచి తీవ్ర రక్తస్రావం అయింది. కుటుంబ సభ్యులు ఆయనను వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారు జామున మృతిచెందాడు. సతీశ్‌కు భార్య మాధవి, కొడుకు, కూతురు ఉన్నారు. మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పాముకాటుతో ఒకరు..

మంచిర్యాలనేరవిభాగం: మంచిర్యాల గోదావరి రైల్వే వంతెన వద్ద గురువారం తెల్లవారుజామున పాముకాటుతో ఒకరు మృత్యువాత పడినట్లు జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు. అంతర్గాం చెందిన ఆకారపు సత్యనారాయణ(55) మంచిర్యాలలోని గోదావరి వంతెన వద్ద జరుగుతున్న పనులకు వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజు మాదిరి బుధవారం రాత్రి పని స్థలం వద్ద నిద్రిస్తున్న క్రమంలో పాముకాటు వేయడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గురువారం ఉదయం స్థానికులు ఆయనను గుర్తించి మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య భారతి, కూతురు సుస్మితలు ఉన్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కేసు నమోదు చేశారని ఆత్మహత్యాయత్నం

గోదావరిఖని, న్యూస్‌టుడే: పక్కింటి మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడన్న కారణంతో ఓ వ్యక్తిపై కేసు నమోదు కావడంతో.. మనస్తాపం చెందిన ఆతను క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ ఘటన గోదావరిఖనిలో గురువారం జరిగింది. సింగరేణి గనిలో పనిచేసే ఉద్యోగి.. తన ఇంటి పక్కన ఉండే మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినట్లు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దానిపై ఆకారణంగా కేసు నమోదు చేశారంటూ మనస్తాపం చెందిన సదరు ఉద్యోగి.. తన స్వగ్రామంలో క్రిమిసంహారక మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతనిని గమనించిన స్థానికులు ఆసుపత్రిలో చికిత్స అందించారు. దీనిపై పోలీసులు ఎలాంటి కేసు నమోదు చేయలేదు.

విధుల్లోంచి తొలగించారంటూ..

గోదావరిఖని పట్టణం: ఆకారణంగా తనను విధుల్లోంచి తొలగించారంటూ మనోవేదనకు గురైన మసూద్(30).. గోదావరిఖనిలోని ప్రభుత్వ వైద్య కళాశాలలో గురువారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పలు ఆసుపత్రుల దృశ్యాలను చిత్రీకరించి వీడియో వైరల్ చేశారని ఆరోపణతో రెండు నెలల క్రితం గుత్తేదారు తనను విధుల్లోంచి తొలగించారంటూ మనోవేదనకు గురైన మసూద్.. గురువారం సంబంధిత గుత్తేదారు వైద్య కళాశాలకు రావడంతో.. ఆయన ఎదుట తన వెంట తెచ్చుకున్న హానికర రసాయనం తాగాడు. అక్కడున్నవారు గమనించి వెంటనే గోదావరిఖని లోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు.

అదుపుతప్పి తాటిచెట్టును ఢీకొన్న ఇసుక లారీ


లారీలోంచి డ్రైవరును బయటకు తీస్తున్న స్థానికులు

మంథని, న్యూస్‌టుడే: ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి తాటిచెట్టును ఢీకొన్న ఘటన మంథని మున్సిపల్ పరిధిలోని గంగాపురి వద్ద గురువారం జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. మంథని మండలం అడవిసోమన్‌పల్లి ఇసుక క్వారీ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ఇసుక లారీ మంథని పట్టణంలోని గంగాపురి రైస్ మిల్లు సమీపంలో అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న తాటిచెట్టును ఢీకొని బోల్తాపడింది. గమనించిన స్థానికులు క్యాబిన్‌లో ఉన్న డ్రైవర్ సత్యనారాయణను సురక్షితంగా బయటకు తీశారు. అదృష్టవశాత్తు ఆటువైపు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే డ్రైవర్ మద్యంమత్తులో ఉన్నట్లు స్థానికులు, పోలీసులు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన డ్రైవర్ సత్యనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేశ్ చెప్పారు.

ఇసుక వాహనం పట్టివేత

సుల్తానాబాద్: మండలంలోని కదంబాపూర్ నుంచి కరీంనగర్‌కు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాన్ని గురువారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి పట్టుకున్నారు. మానేరు వాగు నుంచి ఇసుకను జిల్లెడ పల్లి.. సంపుల్లో నింపి తరలిస్తుండగా వాహనాన్ని పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు.

యువకుడికి తీవ్ర గాయాలు

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం రామా వద్ద గురువారం ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో కమాన్‌పూర్ మండలానికి చెందిన యువకుడు బుర్ర రాజు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన పోలీస్ సిబ్బంది రాజుకు ముత్తారం పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అందించారు. అనంతరం గోదావరిఖనికి తరలించారు.

కూలీ మృతిపై కేసు నమోదు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరిఖని రెండో పట్టణ పోలీసుస్టేషన్ పరిధి జనగామ గ్రామ శివారులోని ఓ ఇటుకబట్టీలో విధుల నిర్వహించే నిరంజన్‌సింగ్ బోరియా(40) మృతిపై గురువారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఒడిశాకు చెందిన నిరంజన్‌సింగ్ జీవనం ఉపాధి నిమిత్తం జనగామ గ్రామ శివారులోని ఓ ఇటుకబట్టీలో విధుల్లో చేరాడు. బుధవారం నిరంజన్‌సింగ్‌తోపాటు జయకుమార్ గోదావరిలో చేపలు పట్టుకొని వండుకొని తిన్నారు. అనంతరం వీరికి వాంతులు, విరోచనాలు కావడంతో ఇటుకబట్టీ నిర్వాహకులు వీరిని గోదావరిఖని ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. వీరిలో నిరంజన్‌సింగ్ బోరియా బుధవారం అర్ధరాత్రి మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఆహారం కలుషితం కారణంగానా లేక ఇతర కారణంతో మరణించాడా అనేది తెలాల్సి ఉందన్నారు. ఈ మేరకు మృతుని సమీప బంధువు దుర్యోధన్‌బోరియా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు గల్లంతు

యైటింక్లయిన్‌కాలనీ: గోదావరి కోల్‌బెల్ట్ వంతెన వద్ద నదిలో స్నానానికి వెళ్లిన ఓ యువకుడు గల్లంతు అయినట్లు గోదావరిఖని రెండో పట్టణ పోలీసులు తెలిపారు. సీఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. పట్టణంలోని గంగానగర్‌కు చెందిన సుద్దాల రాజు(29) అనే తాపీ మేస్త్రీ స్నానం చేయడానికి స్నేహితులతో కలిసి స్థానిక సమ్మక్క గద్దె వద్ద నదిలోకి దిగాడు. ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ఈత రాకపోవడంతో కొట్టుకుపోయాడు. బాలరాజు ఆచూకీ కోసం జాలర్లతో గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఓసీపీ-I సీహెచ్‌పీలో ప్రమాదం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-3 డివిజన్‌లోని ఓసీపీ-1 సీహెచ్‌పీలో గురువారం జరిగిన ప్రమాదంలో సత్యనారాయణ అనే కార్మికుడు గాయపడ్డాడు. బొగ్గు రవాణా కీలకమైన బెల్ట్ మరమ్మతులు చేస్తున్న క్రమంలో.. దాని కిందున్న సత్యనారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. తొలుత గోదావరిఖని సింగరేణి ఆసుపత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

ఓబీ పనుల నిలిపివేతపై చర్చలు

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి ఓసీపీ-5లో మట్టి తొలగింపు పనులు నిర్వహించే పీసీ పటేల్ కంపెనీ ప్రతినిధులతో ఆర్జీ-1 జీఎం లలిత్‌కుమార్ గురువారం చర్చలు జరిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ.. పీసీ పటేల్ కంపెనీలో ఈనెల 18 నుంచి పనులు నిలిపివేశారు. దీంతో పనులు నిలిచిపోయాయి. మట్టి తొలగింపు పనులు ఆగిపోవడంతో బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడింది. దీంతో పీసీ పటేల్ కంపెనీ ప్రతినిధులతోపాటు స్థానిక నాయకులతో జీఎం చర్చలు కొనసాగించారు. దీనిపై ఇంకా ఎలాంటి స్పష్టత రాలేదు.


సంస్థ ప్రతినిధులతో ఆర్జీ-I జీఎం లలిత్‌కుమార్

సీఎంపీఎఫ్ కుంభకోణంపై విచారణ జరగాలి

యైటింక్లయిన్‌కాలనీ: కోల్‌మైన్స్ ప్రావిడెంట్ ఫండ్ కుంభకోణంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ.. గురువారం భారతీయ మజ్దూర్ సంఘ్ ఆధ్వర్యంలో ఆర్జీ-2 జీఎం కార్యాలయం ముందు నాయకులు, కార్మికులు ధర్నా నిర్వహించారు. అలాగే సింగరేణి ఆర్జిత వాస్తవ లాభాల్లో కార్మికులకు 33శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు.

నికర లాభాలపై సంతకాల సేకరణ

గోదావరిఖని: సింగరేణి సంస్థ నికర లాభాలపై వాటాను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ తెబొగకాసం నాయకులు గనుల్లో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. యాజమాన్యం పూర్తి లాభాలపై వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు. కోల్‌బెల్టు ప్రాంత ఎమ్మెల్యేలు దీనిని సీఎం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. నాయకులు శంకర్, ప్రవీణ్‌కుమార్, సత్యనారాయణ, రాజ్‌కుమార్, రాజేశం, జోసెఫ్, శ్రావణ్, సారయ్య పాల్గొన్నారు.

సింగరేణి

స్వచ్ఛత కార్యక్రమంపై సమీక్ష

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు సంస్థ వ్యాప్తంగా అక్టోబర్ 2 నుంచి 31 వరకు స్వచ్ఛత 4.0 కార్యక్రమం విధివిధానాలపై జీఎం ఎన్.సుధాకర్‌రావు కార్యాలయంలో గురువారం సమీక్షించారు. అధికారులు శ్రీనివాసులు, రాజారెడ్డి, వెంకటరమణ, సుదర్శనం, రాజేంద్రప్రసాద్, ఐలయ్య, కల్యాణ్, రాజేశ్వరి పాల్గొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు

కమాన్‌పూర్(సెంటినరీకాలనీ), న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారానికి ఆర్జీ-3 జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని బీఎంఎస్ ఆర్జీ-3 బ్రాంచ్ కార్యదర్శి రౌతు రమేశ్ పిలుపునిచ్చారు. ఈ మేరకు సెంటినరీకాలనీలోని బీఎంఎస్ కార్యాలయంలో గురువారం గోడ పత్రిక ఆవిష్కరించారు. 28న కొత్తగూడెం ప్రధాన కార్యాలయం ఎదుట మహాధర్నా నిర్వహిస్తామన్నారు. ఏరియా ఉపాధ్యక్షుడు ప్రసాద్, డివిజన్ నాయకులు స్వామి, సురేశ్, సంతోశ్, కృష్ణ పాల్గొన్నారు.

కూలిన బొగ్గు.. తప్పిన ప్రమాదం

గోదావరిఖని, న్యూస్‌టుడే: సింగరేణి ఆర్జీ-1 ప్రాంతంలోని జీడీకే-11 గనిలో గురువారం ఉదయం షిఫ్టులో కంటిన్యూస్ మైనర్ యంత్రంపై బొగ్గు పొర కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో భారీ ప్రమాదం తప్పింది. యంత్రాన్ని బయటకు తీసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు.


ధర్మారంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్


రామగుండం: మేయర్ అనిల్‌కుమార్ తదితరులు


సుల్తానాబాద్ పుర కార్యాలయంలో..

చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు

దొరల అణచివేతను అణగదొక్కిన బహుజన బిడ్డ.. నిజాం రాజులతో పోరాడిన ధీర వనిత చాకలి(చిట్యాల) ఐలమ్మ జయంతిని జిల్లా వ్యాప్తంగా గురువారం ఘనంగా నిర్వహించారు. రాజకీయ నాయకులు, అధికారులు, రజక సంఘాల ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటాలకు.. విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె సాయుధ పోరాటాన్ని స్మరించుకున్నారు.

- న్యూస్‌టుడే, బృందం


మంథనిలో రజక సంఘం ఆధ్వర్యంలో..


పోలీసు కమిషనరేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సీపీ శ్రీనివాస్

మంథని మున్సిపాలిటీలో వైద్య శిబిరం

మంథని, న్యూస్‌టుడే: మంథని మున్సిపల్ కార్యాలయంలో గద్దలపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సృజన్ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బంది మున్సిపల్ ఛైర్‌పర్సన్ రమాదేవితో పాటు ఉద్యోగులకు, కార్మికులకు ఆరోగ్య, రక్త పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. ఇన్‌ఛార్జి కమిషనర్ మనోహర్, కౌన్సిలర్లు లింగయ్య, నాగేంద్ర, రవి, వైద్యురాలు శివాని, సీహెచ్‌వో ఉమాదేవి, వైద్య సిబ్బంది దివ్య, శ్రీజ, ప్రవళిక, శ్రావణ్ పాల్గొన్నారు.


పుర ఛైర్‌పర్సన్ రమాదేవికి పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

మంథని: మంథనిలో పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి పురస్కరించుకొని రెనె ఆసుపత్రిలో వైద్యశిబిరం నిర్వహించారు. బీపీ, మధుమేహం తదితర పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. భాజపా జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, వైద్యులు సుధీర్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

స్థానికేతరులను తొలగించండి

ఫెర్టిలైజర్ సిటీ, న్యూస్‌టుడే: రామగుండం ఎరువుల కర్మాగారంలోని ఒప్పంద కార్మికుల్లో స్థానికేతరులను తొలగించి.. స్థానికులకు అవకాశం కల్పించాలని నగర మేయర్ అనిల్‌కుమార్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఎరువుల కర్మాగారం చీఫ్ జనరల్ మేనేజర్ ఉదయ్‌రాజ్‌కు వినతిపత్రం అందించారు. అక్టోబరు 1లోగా తొలగించకుంటే ఆందోళనను తీవ్రతరం చేస్తామన్నారు.


వినతిపత్రం అందిస్తున్న మేయర్, కార్పొరేటర్లు

నూతన కోర్సుతో ప్రయోజనం

మార్కండేయకాలనీ: గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అండ్ ఇన్సూరెన్స్(బీఎఫ్ఎస్ఐ) నూతన కోర్సు మంజూరు కావడంపై కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జైకిషన్‌ఓజా సంతోషం వ్యక్తం చేశారు. గురువారం కళాశాల స్వాగతోత్సవ వేడుకలో ఆయన మాట్లాడుతూ.. కోర్సు మంజూరుకు సంబంధించి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్తం

■ డీటీఎఫ్ సభ్యత్వ నమోదు

మార్కండేయకాలనీ: డీటీఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం నిర్వహించారు. డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డీటీఎఫ్) జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్. రాష్ట్ర కౌన్సిల్ సుదర్శన్‌రెడ్డి, ప్రతాప్‌చారి, రమేష్, ఉమామహేశ్వర్‌రావు, రవి ప్రసాద్, శ్రీనివాస్, స్వరూప్‌చందర్‌లున్నారు.

■ పోటీల్లో ఓసీపీ-3 జట్టు విజయం

యైటింక్లయిన్‌కాలనీ: వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో గురువారం కాలనీలోని అబ్దుల్‌కలాం క్రీడా మైదానం ఆవరణలో నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల్లో ఓసీపీ-3 జట్టు విజయం సాధించింది. ఆర్జీ-2 డివిజన్‌లోని వకీలుపల్లెగని జట్టుకు ఓసీపీ-3 జట్టు మధ్య జరిగిన పోటీల్లో ఇరు జట్లు తలపడ్డాయి. ఈ పోటీల్లో అత్యంత ప్రతిభ చూపిన క్రీడాకారులను త్వరలో జరగనున్న రీజినల్ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని క్రీడల పర్యవేక్షకులు నరేందర్‌రెడ్డి తెలిపారు.

■ సదాశయ ఫౌండేషన్‌కు నేత్రాలు దానం

కాల్వశ్రీరాంపూర్: మండల కేంద్రానికి చెందిన గోలి చినచంద్రయ్య(50) గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దానం చేశారు. ఫౌండేషన్ బాధ్యులు క్యాతం మల్లేశం పాల్గొన్నారు.

■ నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

ఓదెల: కనగర్తి పెద్దమ్మతల్లి ఆలయంలో సీసీ కెమెరాలను గురువారం పొత్కపల్లి ఎస్సై అశోక్‌రెడ్డి, సుల్తానాబాద్ సీఐ సుబ్బారెడ్డి ప్రారంభించారు. ముదిరాజ్ సంఘం నాయకులు రాజేశం, కిష్టయ్య, కొంరయ్య పాల్గొన్నారు.

■ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

సుల్తానాబాద్: ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూత్ ఫర్ సేవా, భరోసా స్వచ్ఛంద సేవా సంస్థల వారు బ్యాగులు, నోటు పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. సంస్థ సభ్యులు నాగరాజు, సతీశ్‌బాబు, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు

పాలకుర్తి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మండలంలోని పుట్నూరు పీహెచ్‌సీ పరిధి పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు సఫాయి మిత్ర సురక్ష శిబిరాన్ని గురువారం చేపట్టారు. పీహెచ్‌సీ వైద్యాధికారి సాయిసూర్య ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీడీవో శశికళ, ఎంపీవో సుదర్శన్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్: కమాన్‌పూర్, జూలపల్లి, గుండారం గ్రామపంచాయతీల పారిశుద్ధ్య కార్మికులకు పీహెచ్‌సీ వైద్యులు గురువారం పరీక్షలు చేసి.. మందులు అందించారు. ఎన్‌సీడీ కార్యక్రమం అధికారులు రాజమౌళి, మధుసూదన్‌లు పరిశీలించారు. వైద్యులు స్వాతి, సింధూర, ఎంపీడీవో లలిత, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

■ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

జ్యోతినగర్(మార్కండేయకాలనీ): ఎన్టీపీసీ పర్మినెంట్‌టౌన్‌షిప్‌లో నిర్వహించిన రోలర్ స్కేటింగ్ జిల్లా స్థాయి పోటీల్లో పలు విద్యార్థులు బంగారు, కాంస్య పతకాలు సాధించినట్లు శిక్షకుడు కృష్ణ తెలిపారు. వీరంతా అక్టోబరు 8న భువనగిరిలో రాష్ట్ర స్థాయి రోలర్‌స్కేటింగ్ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నారు.

■ సదరంలో 63 మందికి వైద్య పరీక్షలు

గోదావరిఖని పట్టణం: పట్టణంలోని ప్రభుత్వ సార్వజనిక ఆసుపత్రిలో గురువారం నిర్వహించిన సదరం శిబిరంలో 63 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వినికిడి లోపం ఉన్నవారిని హైదరాబాదుకు సూచించారు. వైద్యులు మనుంజయ్, వేణుమాదవ్ పాల్గొన్నారు.

■ ఆత్మగౌరవ సదస్సు విజయవంతానికి పిలుపు

ముత్తారం: గోదావరిఖనిలో ఆదివారం జరిగే మాల ఉద్యోగ కుటుంబ ఆత్మీయ సభ విజయవంతానికి ఉస్మానియా యూనివర్సిటీ టీమ్ అధ్యక్షుడు డానియల్, భాను తేజ పిలుపునిచ్చారు. అడవిశ్రీరాంపూర్‌లో సంబంధిత పోస్టర్‌ని ఆవిష్కరించారు.

■ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం పరిశీలన

మంథని గ్రామీణం: గుంజపడుగు, సిరిపురం గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా పారిశుద్ధ్య పనులను గురువారం డీఎల్‌పీవో సతీష్ పరిశీలించారు. సఫాయి మిత్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ సిబ్బందికి వైద్య పరీక్షలు చేశారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ వైష్ణవి, ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శి నరేష్, ఆశా వర్కర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరిఖని పట్టణం, పాలకుర్తి: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా నగరపాలక కార్యాలయంలో గురువారం స్వశక్తి మహిళలు తమవంతుగా స్వచ్ఛతను పాటించడంతోపాటు నగరవాసులకు అవగాహన కలిగించేందుకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. నగరపాలక కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు. పాలకుర్తిలోని కన్నాల, అంతర్గాం మండలం కుందనపల్లి పార్క్ పరిధిలోని అటవీ శాఖ ఆధ్వర్యంలో పలుచోట్ల మొక్కలు నాటి.. అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను శుభ్రం చేశారు. వైద్యాధికారిణి హరితభవాని, అటవీ అధికారులు నాగయ్య, దేవదాస్, రహమతుల్లా తదితరులు పాల్గొన్నారు.

■ బాలల సంరక్షణ చట్టాలపై అవగాహన

మార్కండేయకాలనీ: గోదావరిఖని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు బాలల సంరక్షణ చట్టాలపై చైల్డ్ హెల్ప్ లైన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఉమాదేవి అవగాహన కలిగించారు. సమస్య ఎదురైతే వెంటనే 1098 టోల్ ఫ్రీ నంబరుకు సమాచారం అందజేయాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇజ్రాయిల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

■ వరి పొలాల పరిశీలన

జూలపల్లి: కుమ్మరికుంట, అబ్బాపూర్ గ్రామాల్లో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారిని ప్రత్యూష గురువారం పరిశీంచారు. ప్రస్తుతం వరి పంటలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఎక్కువగా ఆశిస్తుందన్నారు. నివారణకు ప్లాంటమైసిన్, కార్బండిజం, మాంకోజెబ్ కలిపి పంటలకు పిచికారీ చేయాలన్నారు.

కాల్వశ్రీరాంపూర్: మొట్లపెల్లి, కిష్టంపేట గ్రామాల్లో తెగులు సోకిన వరి పంటలను మండల వ్యవసాయాధికారి డి.నాగార్జున గురువారం పరిశీలించారు. తెగులు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.

■ కాలువకు మరమ్మతులు

ఎల్కలపల్లి(ఫెర్టిలైజర్ సిటీ): పాలకుర్తి మండలం ఎల్కలపల్లి చింతల చెరువు గైడ్ కాలువకు రైతులు గురువారం మరమ్మతులు చేశారు. కాలువలో పేరుకుపోయిన గడ్డిని తొలగించి.. నీరు లీకేజీ అవుతుండడంతో ఇసుక బస్తాలు వేశారు.

■ డీజీఎంకు ట్రస్మా నాయకుల సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ఆర్జీ-2 డీజీఎం(పర్సనల్), అధికార ప్రతినిధిగా బాధ్యతలు స్వీకరించిన అనిల్‌కుమార్‌ను గురువారం ట్రస్మా(తెలంగాణ గుర్తింపు ప్రైవేటు పాఠశాల యాజమాన్యం) నాయకులు సన్మానించారు. సింగరేణి ప్రభావిత, పునరావాస గ్రామాలతో పాటూ సమీప పాఠశాలల వివరాలను డీజీఎంకు వివరించారు. నాయకులు టంగుటూరి రాజయ్య, లక్ష్మణ్‌కుమార్, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేగడిమద్దికుంటలో అంధకారం



సుల్తానాబాద్ మండలం రేగడిమద్దికుంటలో వీధి దీపాలు వెలగక రాత్రి వేళ అంధకారం అలముకుంటోంది. పంచాయతీ కార్యాలయం, మల్లయ్యపల్లి తదితర ప్రధాన కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లతో పాటు వీధి దీపాలు వెలుగడం లేదు. మలుపుల వద్ద చీకటితో ప్రమాదాలకు ఆస్కారముంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా అందుబాటులోని అరకొర నిధులను పారిశుద్ధ్య పనులకు వెచ్చిస్తున్నామని, వీధి దీపాల సమస్యపై ఉన్నతాధికారులకు విన్నవించినట్లు చెప్పారు. దసరా సందర్భంగా గ్రామంలో హైమాస్టు లైట్లతో పాటు వీధి దీపాలు ఏర్పాటు చేస్తామన్నారు. -న్యూస్‌టుడే, సుల్తానాబాద్

76 శాతం మందికి పరిహారం చెల్లింపు


తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో హనుమ నాయక్

ముత్తారం, న్యూస్‌టుడే: ముత్తారం తహసీల్దార్ కార్యాలయాన్ని గురువారం మంథని ఆర్డీవో హనుమ నాయక్ తనిఖీ చేశారు. రికార్డులు, కంప్యూటర్లలో భూముల వివరాలను పరిశీలించి ధరణిపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే భూనిర్వాసితుల్లో 76 శాతం మందికి డబ్బులు మొదటి విడతగా ముట్టాయని.. 24 శాతం పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మండలంలో ఓటర్ జాబితా ఇంటింటి సర్వే 99 శాతం పూర్తి చేశారని తెలిపారు. కుల, నివాస, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఎప్పటికప్పుడు జారీ చేయాలని, అక్రమ మైనింగ్ పై నిఘా పెట్టాలని సూచించారు. తహసీల్దార్ సుమన్, సీనియర్ అసిస్టెంట్ భవానిప్రసాద్ పాల్గొన్నారు.

తెలంగాణలో పార్టీపై దృష్టి పెట్టండి

గోదావరిఖని, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని ఖనికి చెందిన తెదేపా మాజీ నాయకుడు జిమ్మిబాబు గురువారం కలిశారు. తెలంగాణలో పార్టీ విస్తరించే దిశగా చూడాలని ఆయన కోరారు.


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న జిమ్మిబాబు

విగ్రహావిష్కరణ

ధర్మారం, న్యూస్‌టుడే: నిత్యం ప్రజాసేవ కోసం తపించేవారు ప్రజల గుండెల్లో నిలిచిపోతారని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. నందిమేడారానికి చెందిన బొడ్డు నారాయణ మొదటి వర్ధంతి సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మాజీ మంత్రి గురువారం ఆవిష్కరించారు. వెల్గటూరు జడ్పీటీసీ మాజీ సభ్యురాలు సుధారాణి, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఆరెంపీ, పీఎంపీల సంఘం మండల ప్రతినిధులు పాల్గొన్నారు.

సంఘాలు-నియామకాలు

పాలకుర్తి: మండల ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఎన్నికలు గురువారం జరిగాయి. అధ్యక్షుడిగా నరేష్, ప్రధాన కార్యదర్శిగా భూమయ్య, కోశాధికారిగా ప్రకాష్‌లు ఎన్నికయ్యారు.

కార్యకర్త అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఎలిగేడు(సుల్తానాబాద్): ఎలిగేడు మండలం లాలపల్లికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త కొప్పుర తిరుమలరెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా గురువారం అంత్యక్రియల్లో ఎమ్మెల్యే విజయరమణారావు పాల్గొని పాడే మోసారు.